అమాయకురాలు

కె.కె.రావు

"అయితే నీ స్నేహితురాలి పెళ్ళికి ఉండకుండా వెళతావురా, నాయనా!" అన్నది భ్రమరతల్లి వెంకటేశ్వర్లుతో.

"ఎట్లాగు పిన్నీ? మా క్లాసువాళ్ళంతా బయలుదేరుతున్నారు. రేపే కాలేజీ తెరుస్తారాయెను. వారం ఆలస్యంగా వెళితే పాఠాలు పోవూ?" అన్నాడు వెంకటేశ్వర్లు

"వారానికే ఏం పోతయ్యేం మహా?" అన్నది భ్రమర తల్లి. వెంకటేశ్వర్లు ఏవేవో అభ్యంతరాలు చెప్పాడు. కాలేజీ చదువంటే స్కూలు చదువు కాదన్నాడు. రెండు వారాలకొక పుస్తకం చొప్పున అయిపోతుం దన్నాడు.

భ్రమర పెళ్ళికి ఉండిపోవటం అతనికి అసలు ఇష్టం లేదు. దాన్ని తనకు కాకుండా మరొకరికిచ్చి ఎందుకు చేస్తు

న్నారూ? అతను ఒకటి రెండు కథలలో చదివాడు, చిన్నతనంనించీ సావాసంగా ఉండి పెళ్ళిచేసుకున్న వాళ్ళనుగురించి. తనూ భ్రమరా.పెళ్ళాడితే చక్కగా కథలో జరిగినట్టుంటుందనే అభిప్రాయం అతనిలో అయిదారు మాసాలనించీ—భ్రమర పెళ్ళిప్రయత్నాలు ప్రారంభ మయినప్పటినించీ—బలంగా ఉంటున్నది. (జీవితం కథల్లో మోస్తరుగాఉంటే బాగుంటుందనే అభిప్రాయం ఇంకా పాతది వెంకటేశ్వర్లుకు.)

కాని తనకూ, భ్రమరకూ పెళ్ళికాదని కూడా వెంకటేశ్వర్లుకు స్పష్టమయిపోయింది. వారికీ తమకూ శాఖ ఒకటి కాదు. బ్రాహ్మలే, ఎదురిళ్ళ వాళ్ళే కాని వివాహం జరగటం అసంభవం.

వెంకటేశ్వర్లు ఆముక్కతో మనస్సును సమాధాన పరుచుకోలేదు, అతనికి కోపం వచ్చింది, తనజీవితంకన్న శాఖావిచక్షణ ఎక్కువనిపించలేదు అతనికి. కాని ఎవరిమీద కోపగించాలో అతనికి తెలియలేదు, అందుచేత అతనికిమరింత కోపంవచ్చింది. ఆ కోపం అతనిమనస్సులో పేరుకుంటూ ఉండింది అది ఇప్పుడు భ్రమర తల్లి మీదికి తిరిగింది.

"పెళ్ళికి ఏమని ఉండమంటుందో ఈవిడ?" అనుకున్నాడతను

అతను బయటికి వస్తుండగా భ్రమర పరుగెత్తుకుంటూవచ్చి అతని చేతులు పట్టుకుని నిలవేసి నవ్వుమొహంతో "ఇవాళ ప్రయాణం మానుకున్నావా, వెంకటేశ్వర్లూ?" అన్నది.

"దేనికి?" అన్నాడు వెంకటేశ్వర్లు మొహం చిట్లిస్తూ.

"మా అమ్మ నిన్ను ఉండమనలా?"

"దేనికి?"

"నా పెళ్ళికి," అన్నది భ్రమర చిన్న గొంతుతో.

"నే నుండను" అన్నాడు వెంకటేశ్వర్లు కఠినంగా, తన కోపానికి కారణం భ్రమరే కాని భ్రమరతల్లి కాదని నిర్ధారణ చేసుకుంటూ.

"ఉండు వెంకటేశ్వర్లూ - సరదాగా!" అన్నది భ్రమర లాలనగా.

'ఏమని ఉండమంటుందో—ఇంత పనిచేసి!' అనుకున్నాడు వెంకటేశ్వర్లు కుములుతూ.

"నీకు కోపంవచ్చిందా?" అన్నది భ్రమర, తనవల్ల ఏదో తప్పు జరిగినట్టుగా.

"నాకెందు కేం కోపం?"

"మరెందుకూ అట్లాఉన్నావు?"

"నాకేం కోపంలేదు. నా కెందుకూ కోపం?" అని గొణుక్కుంటూ వెంకటేశ్వర్లు వెళ్ళిపోయినాడు.

తనకు కోపంవచ్చిందని భ్రమరకు తెలియటం అతనికి తృప్తికరమయింది. భ్రమర తనకు కోపం వచ్చినందుకు కుమిలి కుమిలి చావాలి! అప్పుడు తనకు హాయిగా ఉంటుంది.



వెంకటేశ్వర్లుకు పదిహేడేళ్ళు వచ్చినై. అతనికి భ్రమరమీద ప్రత్యేకించి అభిమానం కూడా లేకపోలేదు. కాని ఆ భావాన్ని ప్రేమ అనటం అతిశయోక్తి అవుతుంది. కాంక్షించక పూర్వం ప్రేమించటం ఎవరితరమూ కాదు. వెంకటేశ్వర్లుకు ఇప్పుడిప్పుడే కాంక్ష అనేది కలుగుతున్నది. అదికూడా అతని మనస్సులో స్ఫుటమైన ఆకారం పొందలేదు. అంతేకాక వెంకటేశ్వర్లు అభిప్రాయంలో కాంక్షకు అతీతమైనదే ప్రేమ. ఆ రెంటికీ తెగని బంధం ఉందని అతనింకా గుర్తించలేదు. భ్రమరను కామించిగాదు అతడు పెళ్లాడగోరింది—తన భార్యగా చేసుకుని గౌరవంగా చూడడానికి.

* *

భ్రమర అంతకంటెకూడా పాపం. అన్యాయమైన స్థితిలో ఉంది. ఆ పిల్లకు వెంకటేశ్వర్లంటే ప్రాణమే కాని అభిమానం ఎంత గాఢంగా ఉందో ఆమెకే తెలియదు తన పెళ్ళి బాగా జరగటానికీ జరగక పోవడానికీ ఉన్నతేడా వెంకటేశ్వర్లు పెళ్ళికి ఉండటమూ ఉండక పోవటమూ మాత్రమే ననుకున్నది. కాలక్రమాన తను అత్తవారింటికి వెళ్ళటమూ, అక్కడ కాపరం చెయ్యటమూ ఉంటుందని ఆమెకు తెలుసు కాని అది తనకు అయిష్టమైన పని అవుతుందని ఆమె భావించలేదు తను మరొకరి భార్య అయే కంటే వెంకటేశ్వర్లు భార్య అయితే బాగుంటుందని ఆమెకు తట్టలేదు అన్యోన్యతకూ దాంపత్యానికి ఏమైనా సంబంధం ఉంటుందని—ఉండాలని — ఆమె ఎరగదు. ఆమె పది సంవత్సరాల జీవితంలోనూ అన్యోన్య దాంపత్యం ఆమె ఎన్నడూ చూడలేదు.

వెంకటేశ్వర్లు తన పెళ్ళికి ఉండనటం భ్రమరకు చాలా ఖేదం కలిగిం

చింది. కాని అతనికి కోపంరావటం మరీ దుర్భరమయింది. వెంకటేశ్వర్లుకు తను చాలాసార్లు అదివరలో కోపం తెప్పించింది. కాని ఈసారి అతని కోపం రావటంలో ఏదో విశేషం ఉంది. పూర్వం మాదిరిగా కాకుండా ఈసారి తన తప్పేదో తనకు తెలియలేదు. తన పెళ్ళి వెంకటేశ్వర్లు కిష్టంలేదు. లేకపోతే పెళ్ళి కెందుకుండడూ? ఆ మాట నిర్ధారణ చేసుకున్న తరవాత భ్రమరకు తన పెళ్ళి అంటే ఒకవిధమైన అసహ్యం పుట్టుకొచ్చింది. అనేక సంవత్సరాలపాటు వెంటేశ్వర్లు అనుమతినీ, ఆమోదాన్నీ పాటించిన భ్రమర ఇప్పుడు అలవాటు మార్చుకుని అతని కిష్టంలేని పెళ్ళి ఎట్లా చేసుకుంటుంది? కాని ఇప్పుడు వ్యవహారం ఆమె చేతుల్లో లేదు. కొంచెం ముందుగా అయితే "నాకీ పెళ్ళి వద్దు నాన్నా!" అంటే కూతురిమాట వినిపించుకునేవాడే భ్రమర తండ్రి.

* *

వెంకటేశ్వర్లు తండ్రి దీనికి సరిగా విరుద్ధం. బుద్ధి తెలిసినప్పటినించీ వెంకటేశ్వర్లుకు తండ్రితో మాట్లాడటానికే హడలు, ఆయన తన పిల్లల యిష్టాయిష్టాలు కనుక్కునే రకంకాదు—పొరపాటున తనకు తెలిస్తే వాటికి విరుద్ధంగా ప్రవర్తించే రకం. అట్లా ప్రవర్తించటం పిల్లలకు చాలా మంచిదని ఆయన అభిప్రాయం!

అందుచేత వెంకటేశ్వర్లు తండ్రిదగ్గిరికి పోయి "నేను భ్రమరను పెళ్ళి చేసుకుంటాను నాన్నా!" అని అనలేకపోయాడు. ఎంతో చనువున్న తల్లితోనే అతను ఆమాటఅనటానికి విశ్వప్రయత్నం చేవలసి వచ్చింది. "నోరుమూసుకో, ఎవరన్నా వింటే నవ్విపోతారు!" అన్నది తల్లి వెంటేశ్వర్లుతో.

వెంకటేశ్వర్లు భ్రమరపెళ్ళికి ఉండకుండా వెళ్ళిపోయినాడు.

* *

భ్రమరపెళ్ళి చిన్నతనపు స్నేహానికి విశేషం అంతరాయం కలిగించలేదు. కాని వెంకటేశ్వర్లు భ్రమరను పూర్తిగా క్షమించలేదు. క్షమించేటట్టు కూడా కనిపించలేదు. తమరిద్దరూ పెళ్ళిచేసుకుని ఉండవలసిందనీ, అది ధర్మమనీ, మంచి కథలన్నిటిలోనూ అట్లాగే జరుగుతుందనీ వెంకటేశ్వర్లు చెప్పిన మీదట భ్రమరకు అతనిమాట నిజమేననిపించింది.

"ఎంత పొరపాటు జరిగిందీ!" అన్నది భ్రమర, ఈడుకు మించిన ఆలోచనాశక్తి ప్రకటించటానికి ప్రయత్నం చేస్తూ.

"పొరపాటు నీదే." అన్నాడు వెంకటేశ్వర్లు. "నువు నన్నే చేసుకుంటానంటే మీ నాన్న ఒప్పుకునేవాడే!"

"నా కెట్లా తెలుస్తుంది, వెంకటేశ్వర్లూ! తెలిస్తే మా నాన్నను అడిగేదాన్నేగా!"



''తెలియకపోవటం తప్పుకాదూ?''

''పోనీ, నీకు తెలుసుగా, నువు మీ నాన్న నెందుకడగలేదూ?''

''మా నాన్నా, మీ నాన్నా ఒకటేనా ఏమిటి? మా నాన్న చంపేస్తాడు!''

''ఎందుకూ? తప్పేముందీ? అన్నది భ్రమర ఆశ్చర్యంతో.

వెంకటేశ్వర్లుకు ఏం చెప్పాలో తోచక కోపంవచ్చి వెళ్ళిపోయినాడు. భ్రమరకు కూడా కోపంవచ్చింది వెంటేశ్వర్లుమీద. అతనికి తనమీద ఈ అర్థంలేని కోప మెందుకూ? తన పెళ్ళినాటినించీ వెంకటేశ్వర్లు ఇదే వరస!

* *

భ్రమర రజస్వల అయి అయిదారు మాసాలయింది. బి. ఏ. రెండోయేడు చదువుతున్న వెంకటేశ్వర్లు ఇంటికి వచ్చాడు, డిసెంబరు శలవులకు. తీరా తమరిద్దరి సావాసానికి అంతం వచ్చేసరికి అతనికి ఆ సావాసం యొక్క అవసరం అపరిమితమయింది. ఇప్పుడిప్పుడు భ్రమర కంటపడితే అతనికి మతిపోతున్నది. కన్ను చెదిరిపోయేటట్టు తయారయింది భ్రమర. అదీగాక వెంకటేశ్వర్లు జరిగిన రెండు మూడు సంవత్సరాలలోనూ ఒకటి రెండు విషయాలు తెలుసుకున్నాడు.

ఈ భ్రమర—ఈ మెరుపుతునక—తనతో ఆడుకుని తనని కొండంత చేసి చూసిన భ్రమరేకాని, కాదు! ఈమెను పెళ్ళాడలేక పోయినందుకు తను పశ్చాత్తాప పడ్డమాట నిజమేకాని ఇప్పుడు కలుగుతున్న పశ్చాత్తాపాన్ని అది ఎక్కడా పోలదు. ఇప్పటి పశ్చాత్తాపంలో నరక కూపాల తాలూకు తపనవుంది.

లోకానికి కట్టుబడి భ్రమర తనను తప్పించుకు తిరుగుతున్నది. కాని తనతో

వెనకటి మోస్తరుగా సావాసం చెయ్యాలనే ఉంది భ్రమరకు. ఈనాడు పెద్దమనిషి అయినంత మాత్రంచేత ఆమె తన దీర్ఘ స్నేహాన్ని మరిచిపోతుందా? అందుకు పశ్చాత్తాప పడుతుందా?

భ్రమర తనతో మాట్లాడితే, తనను ముట్టుకోనిస్తే తనమీద ఆమె కింకా ప్రేమ ఉందని తెలిసినా చాలుననుకున్నాడు. నిజానికి అతని హృదయం పగలదీసి చూస్తే అందులో భ్రమర తనభార్య కాకపోయిందే అనే చింత ఏమీలేదు ఆడదాని ఆవశ్యకత అతనికి అర్థంకాలేదింకా.

భ్రమరను చూడటానికీ, ఆమెను పలకరించటానికీ వెంకటేశ్వర్లు ఎన్ని పాట్లయినా పడ్డాడు. కాని ఆ పాట్లు కొంత వరకు ఫలించకపోలేదు—అంతతో అతనికి అసంతృప్తి కలగలేదన్నమాటేకాని, అతనికి భ్రమర ఏకాంతంగా దొరకాలి. అదిమాత్రం అతని చేతకాలేదు. దైవాత్తూ ఒకసారి అటువంటి అవకాశం దొరికేటప్పటికి వెంకటేశ్వర్లు దాన్ని వినియోగపరుచుకునేటందుకు సంసిద్ధుడై లేడు.

అతను వాళ్ళ వాకిలి తలుపు తెరిచి లోపలికి అడుగు పెట్టబోతుండగా భ్రమర బయటికి రావటానికి ఆ వాకిలిదాకా వచ్చి అతనికి ఎదురుపడింది. ఆ సమయంలో అక్కడ ఇంకొక రెవరూ లేరు. ఇద్దరూ ఒక్కక్షణం కొయ్యబొమ్మలల్లే నిలబడిపోయారు, ఒకరినొకరు చూస్తూ.

"వెంకటేశ్వర్లూ!" అన్నది భ్రమర చాలా చిన్న గొంతుతో. వెంకటేశ్వర్లు నరాలకు ఎవరో పురిపెట్టుతున్నట్టయింది. అతను మాట్లాడబోయి గుటకవేశాడు. ఇంతలో ఎవరోవచ్చి వారిద్దరిబాధ కడతేర్చారు

తరవాత కొద్దికాలానికే భ్రమర కాపరానికి వెళ్ళింది.

అటు తరవాత భ్రమర వెంకటేశ్వర్లు మనసులో నుంచి త్వరలోనే మాసిపోయింది. జరిగినదంతా ఒకసారి సింహావలోకనచేసి చూసుకుని వెంకటేశ్వర్లు నవ్వుకున్నాడు. ఎఫెన్ ఎం. డెన్ కాటోలు రాసిన ఒక నవలలో ఒక కన్య తనకిష్టం లేని వాణ్ణి పెళ్లాడబోతూ తన కన్యాత్వాన్ని ప్రేమించినవాడికి ధారపోసేస్తుంది. పెళ్లాడిన తరవాత భర్త కాని వాడికి తన శరీరాన్ని అర్పించటం ఆమె అభిప్రాయంలో నీతికాదు. పెళ్ళయిన తరవాత ప్రియుడి వంక చూడటం అవినీతి అవుతుందని పెళ్లికి ముందే తన ప్రియుడికి తన చాతనయిన సుఖం యిచ్చింది. భ్రమరకూడా అటువంటి నీతి ఏమైనా పాటించివుంటే వెంకటేశ్వర్లు తృప్తిపడేవాడేమో. ఇపుడు భ్రమర పరగతం—ఉచ్ఛిష్టం.

కానీ, మళ్ళీ భ్రమర కంటబడినప్పుడు వెంకటేశ్వర్లు హృదయం తటతటలాడింది. అయినా అందులో విశేషం లేదు. ఆ మాత్రం చక్కనిదాన్ని చూస్తే



ఎవరి గుండె అయినా తటతటలాడ వచ్చును. పైగా గతాన్ని సంపూర్ణంగా మరవటం ఎవరివల్లా కాదు.

కాపరానికి వెళ్ళిన తరవాత భ్రమర ప్రవర్తన మారింది. ఆమె ఇప్పుడు వెంకటేశ్వర్లును చూసి సిగ్గుపడటంలేదు; ఎదురుగావచ్చి స్వేచ్ఛగా మాట్లాడుతుంది. ఒక విధమైన వేదాంతం కూడా నేర్చుకుంది. ఏదో సందర్భంలో ఆమె వెంకటేశ్వర్లు తోనే అన్నది.

"మనం కోరేవన్నీ గొంతెమ్మ కోరికలే. మనం అనుకున్నట్టు అక్షరాలా ఏదీ జరగదు. మనకు వచ్చే సుఖాలేవీ రుచించవు. ఎప్పటికైనా మనకు కలిగిన సుఖాలకంటె మనం ఊహించుకునే సుఖాలే బాగుంటై!"

"ఓ యబ్బా!" అనుకున్నాడు వెంకటేశ్వర్లు. ఆ మాటలను అతను సహృదయంతో అర్థంచేసుకోకుండానే.

* *

భ్రమర అయిదోతనం సంవత్సరం పైన నాలుగైదు మాసాలు మాత్రమే దక్కింది. టైఫాయిడు జ్వరంవచ్చి ఆమె భర్త మరణించాడు.

ఈవార్త వినగానే వెంకటేశ్వర్లు చాలా విచిత్రమయిన ఆలోచనా పరంపరలో పడిపోయినాడు. భ్రమర భర్తను అతను చూడనేలేదు. పరిస్థితులు అట్లా ఒనగూడినై. తనకూ, భ్రమరకూ మధ్య అడ్డంగా ఉండిన ఈ ఛాయ కాస్తా తొలిగిపోయింది. ఇక కావాలంటే భ్రమర తనదే!

న్యాయంగా ఈ ఆలోచన రాగానే వెంకటేశ్వర్లు మనసు పొంగి ఉండవలసింది. కాని అట్లా జరగలేదు. అతనికి భయంవేసింది. ఈ భావాన్ని అతను విమర్శించుకోలేదు. విమర్శించటం అతనికిష్టంలేదు.

కారణమేమంటే, భ్రమరను తిరిగి పెళ్లాడవలిసిన బాధ్యత నైతికంగా తన మీద ఉందని అతని అంతరాత్మ చెబుతున్నది. వితంతువును — కొంతకాలం కాపరంచేసిన వితంతువును పెళ్లాడటానికి అతని అంతర్బుద్ధి ఏమాత్రమూ సమ్మతించటంలేదు. తనకూ భ్రమరకూ మధ్య ఉండిన ఛాయ కాస్తా పోయినందుకు అతని కా ఛాయమీద చాలా కోపంగా ఉంది.

కాని తనకు భ్రమరమీద అంత దృఢమైన ప్రేమ లేదని కాని, ఆమెను పెళ్లాడటం తన కిష్టంలేదని గాని ప్రాణం పోయినా వెంకటేశ్వర్లు ఒప్పుకునేటందుకు సంసిద్ధుడై లేడు. అతని అంతస్సుమాత్రం వలలో చిక్కిన పక్షిమాదిరిగా ఇందులోనించి బయటపడే మార్గం ఏదైనా ఉందా అని దిక్కులు చూస్తూనే ఉంది. వెంకటేశ్వర్లు అడకత్తెరలో వక్క మాదిరిగా ఉన్నాడు.

*　　*

ఈ పరిస్థితినించి వెంకటేశ్వర్లుని భ్రమరే రక్షించింది. ఆమె తల్లి దండ్రుల మాటా, దగ్గిరబంధువుల మాటా వినిపించుకోకుండా కేశఖండనం చేయించుకుంది పదోనాడు.

వెంకటేశ్వర్లు అంతరాత్మ ఒక దీర్ఘ నిశ్వాసం వదిలింది అతను తృప్తిగా ఒక నిట్టూర్పు విడిచి ఊరుకుంటే ఏమైఉండేదో! కాని వెంకటేశ్వర్లు అక్కడ ఆగలేదు ఎక్కడ ఆగాలో తెలిసినవాళ్లు బహుకొద్దిమంది. అందులో . వెంకటేశ్వర్లుమాత్రం ఒకడు కాడు.

అతను భ్రమరను పెళ్ళిచేసుకోవద్దు అని తీర్మానించుకోలేదు కనక పెళ్ళి చేసుకోవటానికి తీర్మానించుకున్నట్టే భావించుకుని భ్రమరమీద మండిపడ్డాడు. ఆమె ఇటువంటి సాహసం ఎందుకు చేయాలి? ఆమెకిక ప్రపంచంలో ఎవరూ లేరా? భర్తను అంతగా ప్రేమించిందా? పోనీ, తనకేం? . ఈ భ్రమరకోసం తను ఎంత బాధపడ్డాడూ? తనకోసమైనా ఆమె పూనవాకారం త్యజించకుండా ఉండవచ్చునే! ఎంతమోసం చేసిందీ! తలుచుకుంటే అతనిగుండె పగిలిపోయింది,

*　　*

భ్రమర పుట్టింటనే ఉంటున్నది. ఆమెకు జీవితం దుర్భరంగా ఉంటున్నది. రోజు గడవదు. ఎక్కడికీ వెళ్లేటందుకు లేదు. ఎవరూ వచ్చి కూర్చుని మాట్లాడనైనా మాట్లాడరు పాపం. అక్కడికీ వెంకటేశ్వర్లు తల్లి రోజూవచ్చి కాస్సేపు కూర్చుంటూ ఉంటుంది.

"ఎన్నడూ వెంకటేశ్వర్లువచ్చి చూడడేం పిన్నీ? నాకున్నవాళ్ళే మీరు. నా దుర్గతికి తగినట్టు మీరుకూడా వదిలేస్తే నేనేమవుతాను? వెంకటేశ్వర్లును

రమ్మను. నాకు చూడాలని ఉంది.'' అన్నది భ్రమర వెంకటేశ్వర్లుతో.

''ఏమోనే అమ్మా! చిన్నదానివాయెను. ఈ రాతకూడా పట్టెను. సిగ్గు పడతా వేమోనని వాడు రాలేదు. చెబుతాలే!''

''సిగ్గూ, నాపిండమూనూ! ఇంకా ఈ జన్మకి సిగ్గేమిటి? వెంకటేశ్వర్లును తప్పక రమ్మను పిన్నీ!''

''ఏంరా, అబ్బాయి, పాపం, భ్రమర నిన్ను చూడాలని కలవరిస్తున్నదిరా పోయి చూడరాదూ? నాతో వందసార్లు చెప్పింది' అన్నది వెంకటేశ్వర్లుతో తల్లి.

వెంకటేశ్వర్లు కప్పు కన్న ఎత్తుగా ఎగిరిపడ్డాడు.

''చాలా మంచిపని చేసింది! ఇప్పుడా అవతారం నేనుకూడా చూడలేదని దిగులా? నాకు చూపించటానికే గుండు చేయించు కుందేమో కనుక్కోరా!''

కొడుకు ఆగ్రహం తల్లికి అర్థం కాలేదు. కాని ఆవిడ అతనిమాటలు మాత్రం భ్రమరకు చెప్పింది. భ్రమర మాట్లాడలేదు. దీర్ఘాలోచనలో పడ్డది.

* *

''నేను మళ్ళీ జుట్టు పెంచుకుంటాను నాన్నా!'' అన్నది భ్రమర తండ్రితో.

''అప్పుడంత మొండిపట్టు ఎందుకు పట్టావు తల్లీ! అట్లాగే పెంచుకో అమ్మా! ఇంతలో మనకులం పొయ్యేదేమీలేదులే!''

నలుగురూ చాటుగా నవ్వసాగారు. మొదట ఆమె యోగ్యతను ఘనంగా చెప్పుకున్న వారందరికీ తలవంపు లయి నట్టయింది. భ్రమర ఇంకేమీ గమనించ లేదు—ఎదుగుతున్న తల వెంట్రుకలు తప్ప.

తను నిజంగా ఎంత అవివేకి! ఎంత తెలివితక్కువది! అదివరకు వెంకటేశ్వర్లు తమ ఇద్దరి బాంధవ్యం గురించి ఎంత స్పష్టంగా తెలియ జెప్పాడు! తను అతని విషయంలో ఎంత కృతఘ్నతతో ప్రవర్తిం చింది! నిజానికి వెంకటేశ్వర్లుకు తను తగిన భార్యా? అతను తనలో ఏం చూసి అభిమానిస్తున్నట్టు! అతనికి కోపంరాదా మరి? తను వైధవ్యమైనా సహించగలదు కాని అతని కోపం సహించలేదు ...

* *

''భ్రమర మళ్ళీ జుట్టు పెంచుకుని చీరెలూ రవికలూ కట్టుకొంటున్నదే, సొంతం నెగ్గించలేని పనులు ప్రారంభిం చకపోతే ఏం?'' అన్నది వెంకటేశ్వర్లుతో తల్లి.

''పెళ్ళి అవుతుందని ఆశపుట్టిం దేమో!'' అన్నాడు వెంకటేశ్వర్లు.

''కొన్నాళ్ళు కాపరం చేసి—''

''ఏమిటమ్మా, బడితెలల్లే ముప్ఫయి యేళ్ళు వచ్చినవాళ్లకు మళ్ళీ కావటంలా?'' అన్నాడతను నిష్కరుణగా.

ఇంతకు తల్లికొడుకుల కిద్దరికీ తెలియ లేదు, భ్రమర ప్రవర్తనకు తమరే కారకు లని!

*　　　*

వెంకటేశ్వర్లు ఎప్రంటిస్ చెయ్యటం కూడా పూర్తిచేశాడు. కోర్టు తెరవగానే ప్రాక్టీసు కూడా ప్రారంభించనున్నాడు. అతని వివాహం కూడా స్థిరమయింది. ఏటి అవతలనించి వచ్చింది సంబంధం. వాళ్లు కొద్దిగో జమీందార్లు. రెండు మూడు లంకలు గాడా ఉన్నాయి.

వివాహానికి అంతా సిద్ధమయేవరకూ భ్రమరకు వెంకటేశ్వర్లు పెళ్ళిని గురించి తెలియదు ఆ సమయాన ఆమె పినతల్లి గారి ఊరువెళ్లింది.

తండ్రి రాసిన ఉత్తరంలో ఈ వార్త చదవగానే "నేను వెళ్లిపోతాను, పిన్నీ!" అంటూ ప్రారంభించింది భ్రమర. కూతురి ఆదుర్దా పినతల్లికి అర్థంకాలేదు. ఇంకా ఒకనెల రోజులైనా పిల్ల తనదగ్గిర ఉంటుం దనుకుంటున్న దావిడ.

భ్రమర పినతల్లి ప్రార్థన వినిపించు కోకుండా ఇంటికి బైలుదేరింది. బండి ఆగ గానే ఆమె తన ఇంటోకి పోవటానికి బదులు వెంకటేశ్వర్లు గారింటోకి వెళ్లింది. ఆమె పెట్టె తీసుకుని బండివాడు కూడా ఆ ఇంటోకే వచ్చాడు.

వెంకటేశ్వర్లు వరండాలోనే నిలబడి ఉన్నాడు. అతను భ్రమరపంక ఆశ్చర్యంతో చూచాడు. ఆమెను చూసి చాలా ఏళ్ళయింది.

"వెంకటేశ్వర్లూ!" అతనిప్పుడు గుర్తుపట్టి "భ్రమరా!" అన్నాడు మెడమీది దాకా పెరిగిన ఆమె జుట్టూ, కొద్దిగా చిక్కిన శరీరమూ చూస్తే వెంకటేశ్వర్లుకు 'ఉచ్ఛిష్టం' అనేమాట స్ఫురించలేదు. అతని పెదిమలు కొద్దిగా కదిలినై. 'నా భార్య!' అనుకున్నాడతను.

"నీ పెళ్లి అవుతున్నదని విని వచ్చాను వెంకటేశ్వర్లూ! నాకెంతో సంతోషంగా ఉంది. నీ పెళ్ళికి ఉండటానికి వీలవుతుందో కాదో ఇప్పుడే చూసి పోదామని వచ్చాను."

భ్రమరనవ్వు సంతోషముల్లే కనిపించ లేదు వెంకటేశ్వర్లుకు. ఆమె తూలి అక్కడే పడిపోతుందేమోనని అతనికి ఒకక్షణంలో అనుమానం గూడా కలిగింది కాని ఆమె అతనితో ఇంకేమీ అనకుండా వెనక్కు తిరిగింది.

"మనం ఇక్కడ ఉండటంలేదు. ఆ ఎదుటింటికి వెళ్ళిపోతున్నాం. ఆ పెట్టె తీసుకునిరా" అంటూ భ్రమర గబగబా వెళ్ళిపోయింది దించిన పెట్టెను మళ్ళీ ఎత్తుకుని బండివాడు ఆమె ననుస రించాడు.

విగ్రహం మాదిరిగా వెంకటేశ్వర్లు అట్లాగే నిలబడిఉన్నాడు.

*　　　*

"నాన్నా, నేను జుట్టు తీయించుకుంటాను. మంగలవాణ్ణి పిలిపించు." అన్నది భ్రమర.

ఆమెతల్లి అందుకుని "చాల్లే, నీకేమైనా మతి చెడుతున్నదా ఏమిటి? అని కసిరింది.

* *

భ్రమర కళ్ళ యెదటినించి తొలగిపోయినా వెంకటేశ్వర్లు మనసులోనించి తొలగిపోలేదు ఆమె జీవితంలో ఈ మధ్య గడిచిన రెండు మూడేండ్ల కాలాన్నీ భగవంతుడు రబ్బరుతో చెరిపినట్టయింది. భ్రమర చిన్ననాటినించీ ఈనాటివరకూ తనదే ననిపించింది అతనికి. భ్రమర కాకుండా మరొకరిని ప్రేమించటం, మరొకరిని ముట్టుకోటం, ముద్దు పెట్టుకోవటం అసంభవం. తనకు భ్రమరేకావాలి!

వెంకటేశ్వర్లు చకచకా తండ్రిదగ్గరికి వెళ్ళాడు. తండ్రి తనవంక ఆశ్చర్యంతోనూ, అసహ్యంతోనూ చూసి "ఏం?" అనేటప్పటికి అతని గుండె బద్దలయిపోయింది. లాభంలేదు; తన కోరిక ఆయనతో చెప్పటం అసంభవం.

* *

కనీసం భ్రమరతోనైనా తన అప్రయోజకత్వం చెప్పేస్తే ఆమె ఏదైనా ఉపాయం చెప్పవచ్చునని వెంకటేశ్వర్లు వీధిదాటి భ్రమరఇంట ప్రవేశించాడు. భ్రమర ఎక్కడా కనిపించలేదు. ఆమె తండ్రి ఇంట్లో ఉన్నట్టు లేదు. తల్లి మడికట్టుకుని వంటింటో ఉన్నది.

"పిన్నీ, భ్రమర ఏదీ?"

"ఏమో నాయనా, గదిలోలేదూ? ఊరినుంచి వచ్చి ఇంకా స్నానమైనా చెయ్యలేదు, చూడూ!"

వెంకటేశ్వర్లు గదిదగ్గరికి వెళ్ళి "భ్రమరా!" అని పిలిచాడు. సమాధానం లేదు. అతను తలుపు నెట్టాడు. దగ్గరిగా వేసి ఉన్న తలుపులు తెరుచుకున్నాయి. లోపల దృశ్యంచూసి వెంకటేశ్వర్లు నిశ్చేష్టుడై నిలబడ్డాడు.

గదినిండా వెంట్రుకలు! వికారమైన తలతో భ్రమర పక్కమీదపడి ఎక్కెక్కి ఏడుస్తున్నది. ఆమె భ్రమర అయి ఉంటుందని వెంకటేశ్వర్లు ఊహించవలసి వచ్చింది. అతనామెను ఆ రూపంతో గుర్తుపట్టలేదు.

* *

వెంకటేశ్వర్లు వివాహం వైభవంగానే జరిగింది కాని పెళ్ళికి భ్రమర రాలేదు. ఆ అవతారంతో ఎట్లా వస్తుంది?

భ్రమరను చేసుకోలేక పోయినందుకు వెంకటేశ్వర్లు తన మనస్సును సులభంగానే సమాధాన పరుచుకో గలిగాడు— ఏమంటే భ్రమర జ్ఞాపకం రాగానే అతనికి ఆనాడు చూసిన భ్రమర తలతప్ప వచ్చినా మరొకటి జ్ఞాపకం వచ్చేది కాదు.

———